క్లుప్తంగా

నేడు గ్రామసభలు

ఉప్పునుంతల: మండలంలోని పెనిమిళ్ల, సీబీతండా, మర్రిపల్లి, ఉప్పరిపల్లి గ్రామాల్లో మంగళవారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించి అభయ హస్తం గ్యారంటీల కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న కుటుంబం ఒక దరఖాస్తు మాత్రమే చేసుకోవాలని ఆయన తెలిపారు.

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం పల్గుతండా, శంకరకొండతండా, సిలోనిబావితండా, లింగారెడ్డిపల్లి గ్రామాల్లో సభలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రెండు బృందాలుగా గ్రామాలకు ఉదయం, మధ్యాహ్నం సభలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

అచ్చంపేట రూరల్: మండలంలోని దుబ్బతండా గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త కిరణ్ కుమార్‌పై ఆదివారం అర్ధరాత్రి కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారు. చికిత్స నిమిత్తం బాధితుడిని హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్నా మాజీ ఎమ్మెల్యే బాలరాజు బాధితుడిని పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ప్రధాన కూడళ్లలో డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. ఆదివారం రాత్రి 10 గంటల నుంచే డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురు పట్టుబడ్డారు. వీరి వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్‌ఐ రమేష్ తెలిపారు. జడ్జి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని పోలీసులు తెలియజేశారు.

ఎంపీడీఓకు నివాళి

కల్వకుర్తి: డివిజన్ పరిధిలోని చారకొండ మండల ఎంపీడీఓ జయసుధ మృతిపై పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం ఆమె నివాసానికి మున్సిపల్ చైర్మన్ సత్యం, మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, ఇతర నాయకులు ఎంపీడీఓ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

తప్పిన పెను ప్రమాదం



మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలో సోమవారం తెల్లవారుజామున శ్రీశైలం వైపుగా వెళ్తున్న కారు ముందు ఉన్న వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు అంబేడ్కర్ విగ్రహం ఎదుట విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఏ ప్రమాదం జరగపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అమ్రాబాద్ పోలీసుల సూచన మేరకు వాహనాన్ని అక్కడి నుంచి తొలగించి పక్కనే ఉన్న ఈగలపెంట పోలీస్ స్టేషన్‌లో తరలించారు.

ఘనంగా సత్యేంద్రనాథ్ బోస్ జయంతి

కందనూలు: విశ్వ విఖ్యాత భారతీయ ఫిజిక్స్ శాస్త్రవేత్త పద్మ విభూషణ్ సత్యేంద్రనాథ్ బోస్ జయంతి సోమవారం జిల్లా కేంద్రంలోని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస వివేకానంద అసోసియేషన్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ విశ్వ విఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌తో కలిసి బోస్ పనిచేసారని, విశ్వం ఆవిర్భావానికి మూలమని భావిస్తున్న దైవకణాల ఆవిష్కరణకు బోస్ మేధస్సే కారణమని పేర్కొన్నారు. బోస్ పరిశోధనలపై పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలు నోబెల్‌లు గెలిచారని వివరించారు. కొత్త సంవత్సరంలో ఇస్రో శాస్త్రజ్ఞులు అనంత విశ్వ రహస్యాల చేధనలో ఎక్స్ పోశాట్ ఉపగ్రహపు సి 58 రాకెట్ ప్రయోగం విజయవంతం ప్రయోగంతో ప్రతి భారతీయుడు గర్వపడేలా చేశారని కొనియాడారు. కార్తీక్, కొత్వాల్, స్వామి, శివ, శ్రీనివాస్, సంతోష్, రవికిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేరుకున్న చెత్తా చెదారం



తాడూరు: మండల కేంద్రంలోని రెండో వార్డులోని మురుగు కాలువ పిచ్చిమొక్కలు, కంపచెట్లతో మూసుకుపోయింది. మురుగు ముందుకు ప్రవహించక ఒకేచోట నిల్వ ఉంటోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, ఈగలు ఆవాసాలు ఏర్పర్చుకున్నాయి. ఇప్పటికైనా అధికారులు మురుగు కాలువను పరిశీలించి పిచ్చి మొక్కలను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



మల్లేశ్వరం పాఠశాలలో



కొల్లాపూర్ రామాలయంలో



అమ్రాబాద్ మండలం సార్లపల్లిలో



తాడూరులో

ఘనంగా కొత్త ఏడాదికి స్వాగతం

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా కొత్త సంవత్సర వేడుకలు సోమవారం ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి పాత ఏడాదికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

■ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పలు ఆలయాలతో పాటు హౌసింగ్‌బోర్డు వేంకటేశ్వర దేవాలయం, అయ్యప్ప సన్నిదానం, మార్కెట్‌యార్డు శివాలయం, హనుమాన్ గుడి, శివాంజనేయ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు ఇళ్ల ముందు రంగవల్లులు వేసి కొత్త ఏడాదికి స్వాగతం పలికారు.

■ అచ్చంపేటలోని మల్లెలతీర్థం, మద్దిమడుగు, అచ్చంపేట వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, ఆంజనేయ, అయ్యప్ప ఆలయం, భ్రమరాంబ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి యువకులు రోడ్లపై బాణాసంచా కాల్చి నూతన ఏడాదికి స్వాగతం పలికి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆలయ చైర్మన్ కందూరు సుధాకర్, కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్‌రావులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకున్నారు.

■ అచ్చంపేట రూరల్ పరిధిలోని శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో భక్తుల రద్దీ పెరిగింది. వందలాది మంది భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

■ కొల్లాపూర్ పట్టణంలోని దేవాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ నాయకులు కేక్ కట్‌చేసి చేశారు. పలు కాలనీల్లో యువకులు, చిన్నారులు కేకులు కట్‌చేశారు.

■ అమ్రాబాద్ మండలం సార్లపల్లిలో ఆరు గ్యారంటీ పథకాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఓ ఇంటి ముందు వేసిన ముగ్గు అందరిని ఆకట్టుకుంది.

■ పెంట్లవెల్లి మండలంలోని జటప్రోలు, మంచాలకట్ట, మల్లేశ్వరం, కొండూరు, గోప్లాపూర్, సింగవరం గ్రామాల్లో న్యూయర్ వేడుకలు నిర్వహించారు. అదే విధంగా మల్లేశ్వరంలో ప్రధానోపాధ్యాయులు విజయేందర్ సింగ్ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు.

■ అమ్రాబాద్, పదరలో యువకులు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు.

■ పెద్దకొత్తపల్లి మండల కేంద్రంతో పాటు దేవల్‌తిరుమలాపూర్ వేంకటేశ్వర స్వామి దేవాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

■ ఉప్పునుంతల మండల వ్యాప్తంగా యువకులు కేరింతలు కొడుతూ కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



జిల్లా కేంద్రంలో రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

■ లింగాల మండల కేంద్రంలో అర్ధరాత్రి వేళ యువత రోడ్ల పైకి వచ్చి నృత్యాలు చేస్తూ, బాణసంచా పేల్చి, స్వీట్లు పంచుకున్నారు.

■ తాడూరు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

■ తెలకపల్లి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో 2024 నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

■ చారకొండలో మహిళలు ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు వేశారు. మండలంలోని జూపల్లిలో నాయకులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

■ కల్వకుర్తి టౌన్ డీఎస్పీ పార్థసారధి ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో వారి సిబ్బందితో కలిసి కేక్ కట్‌చేసి సిబ్బందితో పాటుగా డివిజన్ ప్రజలకు న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపారు.

■ వెల్దండ మండలంలోని గుండాల అంబా రామలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



దేవల్‌తిరుమలాపూర్ దేవాలయంలో



ఉప్పునుంతల కేజీబీవీలో..



వెల్దండ మండలం గుండాలలో



చారకొండ మండలం జూపల్లిలో

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కల్వకుర్తి టౌన్: పారిశుద్ధ్య కార్మికుడు వెంకటయ్య సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ సత్యం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలు అందజేశారు.

క్రిస్మస్ కిట్ అందజేత



దోమలపెంట: ప్రభుత్వం అందజేసిన క్రిస్మస్ కిట్‌ను స్థానిక క్రిస్టియన్ సెంటర్ చర్చిలో సోమవారం ఎంపీడీసీ మల్లికార్జునరావు, గురువయ్య, కుమార్, సామేల్ రాజ్, సునీల్ అందజేశారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. పాస్టర్ రెవె.డా. ఆశీర్వాదం యేసుక్రీస్తు సందేశం వినిపించారు.

వృద్ధులకు అండగా ఉందాం



కల్వకుర్తిరూరల్: కుటుంబ సభ్యుల ఆదరణకు దూరమై వృద్ధాశ్రమంలో ఉంటున్న వృద్ధులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని రిటైర్డ్ వీఆర్‌ఓ నర్సింహులు అన్నారు. సోమవారం పట్టణంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు బియ్యం, నిత్యావసర సరుకులను వాసవీక్లబ్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమ నిర్వాహకులు వెంకటయ్య, నర్సింహా గుప్త దంపతులను సత్కరించారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, అవోపా అధ్యక్షుడు సతీష్, వాసవీ క్లబ్ కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి అశోక్, కృష్ణయ్య పాల్గొన్నారు.

భీమాకోరేగావ్ వీరుల శౌర్య దినోత్సవం



నాగర్‌కర్నూల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



అచ్చంపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలో సోమవారం 206వ భీమా కోరేగావ్ మహావీరుల శౌర్యదినోత్సవాన్ని అంబేద్కర్ ఐడియాలజీ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మద్దిలేటి, శోభన్, కృష్ణయ్యలు పాల్గొని మాట్లాడారు. మూలభారతీయులు సాధించిన అసలైన యుద్ధ విజయ చరిత్రనే భీమా కోరేగావ్ యుద్ధం అని అన్నారు. కులాలను పాటిస్తూ, హక్కులను కాలరాస్తూ పాలకుల 28వేల సైన్యంపై 500 మహర్ యోధులు మహారాష్ట్రలోని భీమా నది ఒడ్డున యుద్ధం చేసి మట్టికరిపించిన రోజును దివస్‌గా జరుపుకుంటున్నామని తెలిపారు. భీమా కోరేగావ్ వీరుల ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. నాయకులు చంద్రయ్య, వెంకటస్వామి, శోభన్, కృష్ణయ్య,నర్సింహా, సంజీవ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట: పట్టణంలోని లింగాల చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట తెలంగాణ మహానాడు ఆధ్వర్యంలో భీమా కోరెగావ్ శౌర్య దివస్ నిర్వహించారు. పీష్వా బ్రాహ్మణులపై మహార్ పోరాట యోధుల యుద్ధ విజయానికి చిహ్నమే భీమా కోరెగావ్ అని వక్తలు పేర్కొన్నారు. పి.శ్రీశైలం, బి.ఆనంద్, కుంద మల్లిఖార్జున్, విష్ణు, కొంకి విజయ్, రవి, మందరి పర్వతాలు, కేశవులు, చిన్నయ్య, జంగయ్య, ప్రభాకర్, సైదమ్మ, లక్ష్మీదేవమ్మ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి

పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ దేవత నుంచి యాపట్ల వరకు బీటీ రోడ్డు కోతకు గురైంది. దీంతో కంకర తేలడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2019 సంవత్సరంలో 21 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం రూ. 21 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు కాంట్రాక్టర్ తీగలపల్లి నుంచి పెద్దకొత్తపల్లి వరకు 11 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టి వదిలేశారు. గతంలో మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి మండల కేంద్రం నుంచి నాయినోనిపల్లి మైసమ్మ దేవత వరకు 7 కిలోమీటర్లు బీటీ రోడ్డు వేయించారు. ప్రస్తుతం మైసమ్మ దేవత నుంచి యాపట్ల వరకు బీటీ రోడ్డు లేకపోవడంతో వాహనదారులకు రోడ్డుపై గుంతలతో పాటు దుమ్ము ధూళితో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అసంపూర్తి రోడ్డును నిర్మాణం చేపట్టాలని యాపట్ల, జగన్నాథపురం గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



యాపట్లకు వెళ్లే దారిలో బీటీ రోడ్డు

బైక్ అదుపుతప్పి ముగ్గురికి గాయాలు

కల్వకుర్తి: చారకొండ మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి ముగ్గురికి గాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం లింగాల మండలానికి చెందిన తీగల చేన్న కేశవులు భార్య, కుమారుడితో కలిసి హైదరాబాద్ నుంచి చారకొండకు ద్విచక్రవానంపై వస్తున్నాడు. చారకొండ మండల కేంద్రంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బాధితులను మండల కేంద్రంలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కేశవులును హైదరాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఈకేవైసీకి తప్పని తిప్పలు



పెద్దకొత్తపల్లి గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులు తీరిన మహిళలు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని విద్య ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద ప్రతి నిత్యం మహిళలు ఈ కేవైసీ కోసం అధికసంఖ్యలో తరలివస్తున్నారు. గంటల కొద్దీ కార్యాలయం వద్ద మహిళలు నిరీక్షిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.500కే సిలిండర్ ఇవ్వనుండటంతో మండలంలోని పలు గ్రామాల నుంచి మహిళలు బారులు తీరుతున్నారు. ఈ కేవైసీ కోసం మూడు నెలల వరకు ఇంకా సమయం ఉందని ఏజెన్సీ నిర్వాహకులు సూచిస్తున్నా రద్దీ ఏ మాత్రం తగ్గడం లేదు.

గడప గడపకు శ్రీరామ దివ్య అక్షతలు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్టు అయోధ్య వారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శ్రీరామ ఆలయం నుంచి గడప గడపకు శ్రీరామ దివ్య అక్షింతలు, అయోధ్య శ్రీరామ ఆలయ ఫొటోను ఇంటింటికి అందజేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు లక్ష్మీకాంత్ మాట్లాడుతూ ఈ నెల 22వ తేదిన అయోధ్యలో బాల రాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా అదేరోజు రాత్రి ప్రతి ఇంటి ముందు 5 దీపాలు వెలిగించాలని కోరారు. శ్రీరామ జన్మభూమి ట్రస్టు సభ్యులు శోభ, విమల, కవిత, స్వాతి, సంధ్య, సువర్ణ, శారద, రఘుపతిరెడ్డి, శేఖర్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: స్థానిక ఆంజనేయ స్వామి, అయ్యప్ప దేవాలయంలో అయోధ్య రాముడి అక్షతలకు పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ఒకటో వార్డులో ఇంటింటికి పంపిణీ చేశారు. మండికారి బాలాజీ , విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మిర్యాల సుధాకరయ్య, దామోదర్ శెట్టి, పాల్గొన్నారు.

కల్వకుర్తి: పట్టణంలోని విద్యానగర్ కాలనీలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు సోమవారం ఇంటింటికి తిరుగుతూ శ్రీరాముని అక్షతలను అందజేశారు. ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు లక్ష్మారెడ్డి, నర్సిరెడ్డి, బలరాం, శ్రీనివాస్, ఆంజనేయులు, రాములు పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లిలో శ్రీరామపూజిత దివ్య అక్షతలు పంపిణీ చేస్తున్న సభ్యులు

కల్వకుర్తిరూరల్: మండలంలోని వెంకటాపూర్‌లో అయోధ్య రాముడి అక్షతలను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అనంతరం గ్రామస్తులకు పంపిణీ చేశారు. సర్పంచ్ వెంకటేశ్వర్లు, జైపాల్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంలో అయోధ్య శ్రీరాముడి అక్షతలను ఇంటింటికి పంపిణీ చేశారు. అంతకుముందు స్థానిక కేదారేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా అక్షతలను తలపై చల్లుకోవాలని సూచించారు. అదే రోజు సాయంత్రం ఇళ్ల ముందు ప్రమిదలను వెలిగించాలని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, వీహెచ్‌పీ నాయకులు కట్టా ప్రభాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, శేఖరాచారీ, కాశన్న రాజాగౌడ్, బంగారయ్య, సాయిచంద్ తదితరులు పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని సూరాపూర్ ఆంజనేయ స్వామి ఆలయంలో అయోధ్య రాముడి అక్షతలకు పూజలు నిర్వహించి ఇంటింటికి పంపిణీ చేశారు. అతినారపు సాయిసాగర్ భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: స్థానిక శ్రీరాముడి ఆలయం నుంచి కొత్త బస్టాండ్ మీదుగా పాత బస్టాండ్ వరకు అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను ఊరేగించారు. రేపటి నుంచి ఇంటింటికి పంపిణీ చేస్తామని భజరంగ్‌దళ్ మండల నాయకులు పల్లెశివ, అర్చకులు శివయ్య శర్మలు తెలిపారు.



ఉప్పునుంతలలో



అచ్చంపేటలో

ఆశాజనకంగా ధాన్యం కొనుగోలు

పెంట్లవెల్లి: రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. దళారి వ్యవస్థను రూపుమాపేందుక కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. రైతులు మోసపోకుండా కొనుగోలు కేంద్రాల వద్దే వరి ధాన్యం విక్రయించేలా అధికారులు అవగాహన కల్పించారు. మండలంలోని కొండూరు, పెంట్లవెల్లి, గోపులాపురం, జటప్రోలు, సింగవరం గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. 20 రోజుల నుంచి ధాన్యం కొనుగోలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండల వ్యాప్తంగా వానాకాలం వరి సాగు విస్తారంగా పండించారు. గతంలో వడ్లు విక్రయించేందుకు రైతులు నానా అవస్థలు పడేవారు. ప్రస్తుతం కల్లాల వద్దే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దళారి వ్యవస్థ లేకుండా నేరుగా రైతుల అకౌంట్లలోనే డబ్బులు జమ చేస్తున్నారు.

దళారి వ్యవస్థకు అడ్డుకట్ట

రైతులు దళారులను ఆశ్రయించకుండా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. దీంతో మధ్యవర్తుల ఆగడాలు పూర్తిస్థాయిలో తగ్గాయి. రైతులు మోసపోకుండా ముందు జాగ్రత్తంగా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. వ్యాపారుల వ్యవస్థకు చెక్‌పెట్టడానికి నేరుగా రైతులు ప్రభుత్వానికే ధాన్యం అమ్మడం, నేరుగా రైతుల అకౌంట్లలోనే అమౌంట్ పడడం ఎంతో బాగుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు వివరాలు

మండలంలోని కొండూరులో 72 మంది రైతులు 5909 క్వింటాళ్లు, పెంట్లవెల్లిలో 38 మంది రైతులు 3444 క్వింటాళ్లు, అదేవిధంగా గోప్లాపూర్‌లో 90 మంది రైతులు 8662 క్వింటాళ్లు, జటప్రోలులో 70 మంది రైతులు 6407 క్వింటాళ్లు, సింగోరంలో 60 మంది రైతులు 3924 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని విక్రయించారు. అదే విధంగా మొత్తంగా మండలంలోని 55860 బస్తాలను ఇప్పటికి ఐకేపీ వారు కొనుగోలు చేశారు. అందులో ఏ రకం రూ.2203లకు బీ రకం రూ.2183లకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించింది.



పెంట్లవెల్లిలో ధాన్యాన్ని సంచులలో నింపుతున్న హమాలీలు

పొరపాట్లు లేకుండా చూస్తున్నాం



మండలంలోని పలు ఐకేపీ సెంటర్లలో కొనుగోలు చేస్తున్న వరి కొనుగోలు ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నాం. రైతులకు కనీస వసతులు కల్పించాం. దళారులను ధాన్యం విక్రయించకుండా అవగాహన కల్పించాం. రైతుల ఖాతాల్లోనే ప్రభుత్వం డబ్బులు జమ చేస్తుంది.

–సుజాత, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు

రుణపడి ఉంటాం



గతంలో ధాన్యం అమ్మిన తరువాత డబ్బుల కోసం ఎదురుచూసేవాళ్లం. దళారుల చుట్టూ తిరుగుతూ నానా అవస్థలు పడ్డాం. రైతులు మోసపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించాం. నేరుగా ఖాతాలో డబ్బులు జమ అయ్యాయి.

– భగవంత్‌రెడ్డి, రైతు, గోప్లాపూర్